తహసీల్దార్ కార్యాలయానికి నేతల తాకిడి


తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్ల సంఘం సభ్యులు

మేడ్చల్: మేడ్చల్ తహసీల్దార్‌గా నూతనంగా భాధ్యతలు చేపట్టిన భూపాల్‌ను అభినందించేందుకు తహసిల్ కార్యాలయానికి నేతల తాకిడి మొదలైంది. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నేతలు, ఆర్య వైశ్య సంఘం నేతలు, ప్రజా సంఘాల నేతలు, రేషన్ డీలర్ల సంఘం సభ్యులు ఆయనను కలిసి సన్మానించారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి


మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బీజేపీ నేతలు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ బీజేపీ నేతలు మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డిని మున్సిపల్ కార్యాలయంలో కలిసి పట్టణవాసుల సమస్యలను వివరించారు. వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శైలజ, శ్రీకాంత్, వంశీవంజరి, రాజు, సర్వేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్ రావు, రాంచంద్రారెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తులు

కీసర: కీసరలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వనజాత ఓ ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్, ఫిజిక్స్, అప్లైడ్ న్యూట్రిషన్, న్యూట్రిషన్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంగ్లిష్, ఎకనామిక్స్, ఎంఎస్‌సీ (డేటా సైన్స్, అనలటిక్స్), ఎంబీఏ (అనలటిక్స్)లో ఆసక్తి గల అభ్యర్థులు పీజీ సబ్జెక్టుల్లో 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, బోధనలో అనుభవంతో పాటు యూజీసీ సెట్, సెట్ అర్హత గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జూలై 9న ఉదయం 11 గంటల వరకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌తో ఇంటర్వ్యూకు హాజరు కాగలరన్నారు. వివరాలకు 7680941485.

అతిథి అధ్యాపక పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మల్కాజ్‌గిరి బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న వొకేషనల్ అతిథి అధ్యాపక పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాము తెలిపారు. టూరిజం హాస్పిటల్ మేనేజ్‌మెంట్ పోస్ట్‌కు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మంగళవారం రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో జరిగే డెమో, ఇంటర్వ్యూకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

రామంతాపూర్ : జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా సోమవారం రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. హోమియోపతి వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్ మాట్లాడుతూ.. తమ విద్యార్థి సంఘం కేవలం ధర్నాలు, రాస్తారోకోలే కాకుండా దేశంలోనే అతిపెద్ద సేవా భావజాలాలు కలిగిన ఏకైక విద్యార్థి సంస్థ అని కొనియాడారు. ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రి సూపరింటెండెంట్ సోమ్యా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, సమితి సభ్యులు శ్యామ్‌కిరణ్, అఖిల్, క్రిష్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, శివసాయినగర్‌లో భారీ మర్రిచెట్టు, తాటిచెట్టు నరికివేతపై సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీసీఎస్ ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి, అశోక్, సత్యనారాయణ, ఉపేందర్, శారదాంబ, సరోజిని, వరలక్ష్మి, రాధిక, సుశీల, శైలజ, విజయ, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునే రంగులు.. తింటే అంతే !



గ్రేటర్ సహా శివారు పురపాలిక సంఘాల్లో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం | కనీస శుభ్రత పాటించని హోటళ్లు.. మాంసం విక్రయ కేంద్రాలు | పట్టించుకోని సంబంధిత అధికార యంత్రాంగం

సాక్షి,సిటీబ్యూరో: ఆకర్షణీయమైన ప్యాకింగ్, ఘుమఘుమలాడే వంటకాల వాసనలు, నోరూరించే ఆహార పదార్థాలు.. బయట హోటళ్లు, తోపుడు బండ్లలో కనిపిస్తుంటాయి. భోజన ప్రియులను ఆకట్టుకునే ప్రయత్నం బాగున్నా.. అందులో వినియోగించే నాసిరకం సరుకులు, హానికరమైన రంగులతో ముప్పు పొంచి ఉంది.

☛ గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 31 పురపాలక సంఘాల్లోని చాలా హోటళ్లు, తినుబండారాల తయారీదారులు నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆహారభద్రత టాస్క్‌ఫోర్స్ బృందం అప్పుడప్పుడు నిర్వహిస్తున్న పలు హోటళ్లు, ఆహారపదార్థాల తయారీకేంద్రాల తనిఖీల్లో విస్తుపోయే కల్తీ ఘటనలు తేటతెల్లమవుతున్నాయి.

ఆహార పదార్థాలపై దుమ్ము, ధూళి..

వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఆహారపదార్థాలపై పడుతోంది. అయినప్పటికీ నిర్వాహకులు అలాగే విక్రయిస్తున్నారు. ముఖానికి మాస్కులు లేకుండానే ఆహార పదార్థాలు, తినుబండారాలు తయారు చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూడుల్స్, ఫ్రైడ్‌రైస్ తయారీ తర్వాత ప్లాస్టిక్ పాత్రలు, కవర్లలో వడ్డిస్తున్నారు. ఆహార పదార్థాలపై ఎలాంటి రక్షణ చర్యలు లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి.

ఆకట్టుకునేందుకు రంగులు...

వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆహార పదార్థాల్లో ప్రమాదకరమైన రంగులను కూడా వాడుతున్నారు. హోటళ్లలో సమోసాలు, బజ్జీలు, గారెలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో చికెన్ మంచూరియా, వెజ్ మంచూరియాల తయారీలో ఎరుపు రంగులు వాడుతున్నారు. మిగిలిన వాటిని ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాలటం ఆడుకుంటున్నారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నుంచి వెలువడే పొగతో కూడా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

మాంసం విక్రయాల్లోనూ..

గ్రేటర్‌తో సహా నగర శివారుల్లోని 31 పురపాలక సంఘాలతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో కూడా పరిశుభ్రత పాటించడం లేదు. పురపాలక సంఘాల్లో మాంసం దుకాణాలపై హెల్త్ ఆఫీసర్ల పర్యవేక్షణ ఏ మాత్రం లేకపోవటంతో ఫ్రిజ్‌లలో 2–3 రోజుల పాటు ఉంచిన మాంసాన్ని కూడా విక్రయిస్తున్నారు. దీంతో పట్టణవాసులు రోగాల భారిన పడుతున్నారు.

తినుబండారాల తయారీలో..

వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా... గ్రేటర్ శివారు జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. కూడళ్లు, చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సమీప ప్రాంతాలతో పాటు హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితో పాటు హైదరాబాద్–నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ షాపుల్లో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు. రహదారులపై ఉండే హోటళ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి.

ప్రమాణాలు గాలికి..

ఆహార పదార్థాల తయారీదారులు, విక్రేతలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలను పాటిస్తూ.. శుభ్రతతో పాటు తాజా సరకులతో పదార్థాలను తయారు చేయాలి. చాలా కేంద్రాలు ఈ నిబంధనలకు గాలికి వదిలేస్తున్నారు. చెడిపోయిన, కుళ్లిపోయిన పదార్థాలు, బూజుపట్టిన కూరగాయలు, రోజులకొద్ది ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పదార్థాలు, కాలం చెల్లిన మసాలాలు, నిత్యావసరాలు, నాసిరకం పిండి, వాడిన నూనెలు మళ్లీ వాడటం, కృత్రిమ రంగులు వినియోగించడం వంటివి చేస్తున్నారు.

పర్యవేక్షణ కరవు..

ఆహార భద్రతాధికారి పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు పురపాలక సంఘాల్లో కూడా హెల్త్ ఆఫీసర్లు లేకపోవటంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలలోని పదార్థాలపై పర్యవేక్షణ కరవవుతోంది. దీంతో తినుబండారాల తయారీతో పాటు హోటళ్లు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలను నడిపేవారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో గత 7 నెలలుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ యంత్రాంగం మిషన్‌భగీరథ నీటిపై పూర్తిగా ఆధారపడటం, స్థానికంగా ఉన్న బోర్లను పట్టించుకోకపోవడంతో నీటిసరఫరా సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని లేఖలో పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను గమనించి రోజూ వారీగా నీటి సరఫరా అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య పండిత అవార్డు ప్రదానం


అవార్డును అందుకుంటున్న వెంకటేశ్వర రుషి

కీసర: కీసరకు చెందిన దొంత వెంకటేశ్వర రుషికి వైద్య పండిత అవార్డు లభించింది. యాదగిరిగుట్టలో పారంపర్య ఆయుర్వేద వైద్య మహాసంఘం ఆధ్వర్యంలో 3 రోజుల పాటు జరిగిన నిరంతర సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విజ్ఞాన సదస్సులో సంఘం అధ్యక్షుడు యాత్రి మహారుషి, గౌరవ అధ్యక్షుడు రఘుపతి పంతులు, ఆర్. శ్రీనివాస్ చేతుల మీదుగా దొంత వెంకటేశ్వర రుషి అవార్డును అందుకున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు


కిష్టాపూర్‌లో జెండా ఎగురవేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఘట్‌కేసర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శామీర్‌పేట్: మూడు చింతలపల్లి మున్సిపాలిటీలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్ల కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ కళామండలి జాతీయ అధ్యక్షుడు అశోక్‌మాదిగ హాజరై మాట్లాడారు. మూడుచింతలపల్లి అధ్యక్షుడు బురుగు రమేష్, నాయకులు పరశురామ్, ఇరుమయ్య, యాదగిరి, కృష్ణ , కాంగ్రెస్ సీనియర్ నేతలు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మేడ్చల్‌లో ఎమ్మార్పీఎస్ నేతలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పరశురాంమాదిగ, బాల నర్సింహ్మ, శివకుమార్, బాలకృష్ణ, ఆనంద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

2026 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

ఘట్‌కేసర్: 2026 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ కన్వీనర్ మీసాల మల్లేష్ అన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ కౌన్సిలర్ మల్లేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 32వ ఆవిర్భావ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తల శ్రమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, వర్గీకరణకు సహకరించిన వారికి మాదిగలు రుణపడి ఉంటారన్నారు. నర్సింగ్‌రావు, శ్రీనివాస్, ఆంజనేయులు, రవి, బాలయ్య, రాందాస్, నవీన్, నర్సింగ్‌రావు, సుధాకర్, గణేష్ పాల్గొన్నారు.

నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాలు కీలకం

మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

కీసర: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేరాలు జరిగినప్పుడు వాటిని ఛేదించేందుకు సీసీకెమెరాలు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడుతాయని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ కాలనీల్లో భద్రతా చర్యల్లో భాగంగా కాలనీ అసోషియేషన్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నేతలు అశిష్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు


స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు


బాసిత్ (ఫైల్)

కీసర: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధి రాంపల్లి– నాగారం ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ నారపల్లికి చెందిన షేక్ బాసిత్(37) తన స్నేహితుడు స్వామి(32)తో కలిసి ద్విచక్ర వాహనంపై రాంపల్లి మీదుగా నాగారం వైపు వస్తున్నాడు. సరిగ్గా నాగారం సత్యనారాయణ కాలనీ సమీపంలోని ప్రధాన రహదారి వద్దకు రాగానే రోడ్డుపై ఉన్న కంకర వల్ల ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరు కింద పడ్డారు. అదే సమయంలో వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ బాసిత్ తలపై నుండి వెళ్లగా.. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక ఉన్న స్వామి తీవ్రంగా గాయపడగా.. అతడిని చికిత్స నిమిత్తం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. నారపల్లిలో టెంట్‌హౌస్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి పెద్ద మృతి చెందడం, నిరుపేద కుటుంబం రోడ్డున పడిందని, మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికుల ఆందోళన..

నాగారం రాంపల్లి చౌరస్తా నుంచి ఘట్‌కేసర్ యంనంపేట్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ప్రమాదం జరిగిన చోట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఇప్పటి వరకు 5 మంది మృతి చెందారని వాపోయారు. కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై వెంకటేషులు స్థానికులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్: ఏదులాబాద్ చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కవాడిగూడకు చెందిన వడ్లూరి లింగం (45) హోమ్ శ్రీసాయి ఏజెన్సీలో సెక్యూరిటీ గార్డ్‌గా చేరాడు. ఆదివారం ఉదయం విధులు నిర్వహించేందుకు బయటకు వెళ్లి, సోమవారం ఉదయం ఏదులాబాద్‌లోని శ్రీ లక్ష్మీనారాయణ చెరువులో మృతదేహం కనిపించింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడా.. లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణికి స్పందన కరువు


పోచారం మున్సిపల్ కార్యాలయం

పోచారం: మున్సిపల్ కార్యాలయం పోచారంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదుదారులు కనిపించలేదు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం లభించకపోవడంతో కొత్తగా ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. మున్సిపల్ ఆఫీస్‌లో సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో అనేక మంది ఫిర్యాదుదారులు కలెక్టర్ కార్యాలయం బాట పట్టారు. కనీసం ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా ప్రజల వెతలు తీరుతాయని ఆశిస్తున్నారు. పోచారం మున్సిపాలిటీలో ఎక్కువగా అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. పార్కులు, ప్రజా ప్రయోజన స్థలాలు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లపైన నిర్మాణాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హైడ్రా కమిషనర్‌ను కలిసిన మసీదు ప్రతినిధులు



బోడుప్పల్: నల్ల చెరువును ఆనుకుని ఉన్న ముస్లిం శ్మశానవాటికకు హద్దులు ఏర్పాటు చేయాలని సోమవారం అలంగిరి మసీద్ కమిటీ ప్రతినిధులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హద్దులు ఏర్పాటు చేస్తే మౌలిక వసతులు ఏర్పాటు చేయించుకుంటామన్నారు. అలంగిరి మసీదు కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అజ్‌ఘర్, ఉపాధ్యక్షులు యాకుబ్, ఇస్మాయిల్, ఇమాముద్దీన్, మాజీ కార్పొరేటర్ సీసా వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బాలికల ఐటీఐ కళాశాల సందర్శన


ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న పావని

ఘట్‌కేసర్: కొండాపూర్‌లో హెచ్‌ఏఎల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన బాలికల ఐటీఐ కళాశాలను కాంగ్రెస్ నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశాల గురించి ప్రిన్సిపాల్‌తో సోమవారం చర్చించారు. కళాశాలలో బాలికలకు ప్రవేశాలపై మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మశ్చేందర్‌రెడ్డి, జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు కల్పించాలని వినతి..

కొండాపూర్ బాలికల ఐటీఐ కళాశాలలో ప్రవేశాలు కల్పించాలని మున్సిపాలిటీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. లక్ష్మారెడ్డి, నగేశ్‌గుప్తా, కమలాకర్, ప్రమోద్‌గుప్తా, సిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

శామీర్‌పేట్: కుటుంబకలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట్‌కు చెందిన నరసింహ (26) వృత్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 8 నెలల క్రితం నగరంలోని అమీర్‌పేట్‌కు చెందిన పూజితో వివాహమైంది. భార్య ప్రస్తుతం గర్భవతిగా ఉంది. పనిలో భాగంగా నరసింహ ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లగా.. భార్య అమీర్‌పేట్‌లోని తన తల్లి ఇంటికెళ్లింది. ఆదివారం నరసింహ ఇంటికొచ్చిన తర్వాత ఫోన్ చేసి ఇంటికి రావాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


భవానీనగర్‌లో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని భవానీనగర్‌లో కమిషనర్ వెంకట్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను, పొదల తొలగించడం, సీసీరోడ్లలో గుంతలు ఉన్నచోట్ల గుంతలు పూడ్చటం, వన మహోత్సవంలో భాగంగా 9వ వార్డుల్లో మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం బస్తీ దవాఖానాను సందర్శించారు. డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టౌన్‌షిప్‌లో సమస్యలపై స్పందన


సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సద్భావన టౌన్‌షిప్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధికారులపై ఫ్లాట్ల యజమానులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. జనరల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, పోచారం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు సమక్షంలో కాలనీవాసులు తమ సమస్యలను వివరించారు. అనంతరం కార్పొరేషన్, కాలనీవాసుల మధ్య లిఖితపూర్వకంగా సమస్యల పరిష్కారంపై ఒప్పందం కుదిరింది. ప్రధానంగా పెయింటింగ్, పనికిరాని లిఫ్టులను తొలగించి, కొత్తవాటిని ఏర్పాటు చేయడం, ఎస్‌టీని పునరుద్ధరించడం, డ్రైనేజీలో పూడికలు, పార్కుల్లో పచ్చదనాన్ని పెంపొందించడం, కార్పస్ ఫండ్ కేటాయించిన తర్వాత నిర్వహణ బాధ్యతలు తీసుకునేలా అసోసియేషన్‌ను ఏర్పాటు చేసేందుకు స్వగృహ కార్పొరేషన్ అంగీకరించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

జీఓ 282 రద్దు చేయాలని కార్మికుల ధర్నా


జీఓ కాపీలను దహనం చేస్తున్న కార్మికులు

పోచారం: కార్మికుల పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 282ను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. సోమవారం అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో జీవో కాపీలను దహనం చేశారు. సీఐటీయూ నాయకులు యాదయ్య, సబిత, అశోక్, సునీత తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్: మేడ్చల్‌లోని వివిధ పరిశ్రమలలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు, కార్మిక నాయకులు ధర్నా నిర్వహించారు. కార్మిక వ్యతిరేక జీవోలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని మెడిసిటీ ఆసుపత్రి, శ్రీరామ స్పిన్నింగ్‌మిల్ కంపెనీలో కార్మికులు జీవో కాపీలను దహనం చేశారు. సీఐటీయూ నాయకులు నరేష్, నర్సింగ్‌రావు, దేవేందర్, యాదగిరి, దేవమ్మ, తస్లీంబేగం తదితరులు పాల్గొన్నారు.